



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 25-6-2025

సంపుటి: 21 సంచిక: 79
పేజీలు: 8 వెల: రూ.1

## ఇచ్ఛాపురం - విజయవాడ ప్రత్యేక రైలు

### ఈస్ట్‌కోస్ట్ సంప్రదింపుల సలహా మండలి బోర్డు సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ నుంచి ఇచ్ఛాపురానికి ప్రత్యేక రైలు వేయాలని ఈస్ట్‌కోస్ట్ సంప్రదింపుల సలహా మండలి బోర్డు సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ డివిజనల్ మేనేజర్‌ను కోరారు. విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ సమావేశ మందిరంలో జరిగిన మొట్టమొదటి సమావేశంలో డాక్టర్ బుడుమూరు రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలోనే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హెడ్ ఆఫీస్‌లు, సచివాలయాలు ఉన్నందున శ్రీకాకుళం జిల్లా వాసులు విజయవాడ వెళ్లడానికి సరైన రైలు లేక తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. శ్రీకాకుళంలో రాత్రి బయలుదేరి విజయవాడలో ఉదయం దిగేటట్టు, విజయవాడలో పనులు ముగించికొని అదే రోజు విజయవాడలో రాత్రి బయలుదేరి ఇచ్ఛాపురంలో ఉదయం దిగేటట్టు ఇచ్ఛాపురం - విజయవాడ ప్రత్యేక రైలు వెయ్యాలని సూచించారు. ఈ మేరకు డివిజనల్ మేనేజర్ మాట్లాడుతూ అతి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. అమృత్ భారత్‌లో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్ రైల్వేస్టేషన్‌లు ఆధునీకరణ పనులతో 6 నెలల్లో రూపురేఖలు మారుతున్నాయని రూ.800 కోట్లతో విశాఖపట్నం 14 ప్లాట్ ఫాంలు రాబోతున్నాయని రాజేష్ తెలిపారు.




# డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ దెబ్బ

- ఈ విధానంతో కళాశాలల్లో తగ్గిపోతున్న ప్రవేశాలు
- యాజమాన్య కోటాకు వర్తించని ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఇక్కడ సీటు కొనే బదులు ఇంజినీరింగ్‌లో చేరడానికే మొగ్గు
- అడ్మిషన్ల ప్రక్రియపై నిర్ణయంలో సర్కారు స్థాయిలో జాప్యం



> "ఇంటర్ ఫలితాలు వెలువడి రెండు నెలలు గడిచింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సైతం వచ్చేశాయి. మరోవైపు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తరగతులు జరుగుతున్నాయి. కానీ డిగ్రీ కళాశాలల్లో మాత్రం ఇంకా అడ్మిషన్లు జరగక.. అసలు ఎప్పుడు జరుగుతాయో తెలియక డిగ్రీ మొదటి సంవత్సరం క్లాస్‌రూములు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. డిగ్రీ అడ్మిషన్లకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానం కూడా చేపట్టాలని ప్రైవేట్ కళాశాలలు కోరుతుండటం, దానిపై నిర్ణయం తీసుకోవడంలో విద్యాశాఖ మంత్రి పేషీ చేస్తున్న జాప్యమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది."

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలకు మరో 20 రోజులు పడుతుందని ఉన్నత విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది సాధారణ ఎన్నికల వల్ల అడ్మిషన్లు ఆలస్యమయ్యాయి. ఫలితంగా కళాశాలల్లో వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది కూడా జాప్యం జరుగుతుండటంతో సీట్లు భర్తీ కావేమోనని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. తెలంగాణలో అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయి క్లాసులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం సింగిల్ సబ్జెక్ట్ విధానం అమలవుతోంది. దీన్ని డబుల్ సబ్జెక్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిపై ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నుంచి అభిప్రాయాలు ఆహ్వానించగా అన్ని కళాశాలలు డబుల్ విధానం కోరుతూ లేఖలు ఇచ్చాయి. అలాగే డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలా? వద్దా? అన్న మీమాంసలో ప్రభుత్వం ఉంది. ప్రైవేట్ కళాశాల మాత్రం ఆఫ్‌లైన్‌లోనే ప్రవేశాలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించాయి. దీనిపై స్పష్టత వచ్చిన తర్వాతే డిగ్రీఅడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుందని ఉన్నత విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే అడ్మిషన్లలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా ఆలస్యంగా అడ్మిషన్లు చేపట్టడంతో అనేక కళాశాలల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అడ్మిషన్లు మొదలుకాకపోవడంతో డిగ్రీలో చేరాలనుకుంటున్న విద్యార్థులు అయోమయంలో పడుతున్నారు.

### ఖాళీగానే యాజమాన్య కోటా సీట్లు

గత విద్యా సంవత్సరం వరకు ఆన్‌లైన్ పద్ధతిలో డిగ్రీ ప్రవేశాలు నిర్వహించేవారు. ఇంటర్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్‌లో రోస్టర్ విధానం ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించేవారు. 2020 నుంచి ఈ విధానం అమల్లో ఉంది. దీనివల్ల ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు నామమాత్రంగానే జరిగేవి. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. అయితే మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు వంటి పథకాలు వర్తించవు. అందువల్లే విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటాలో చేరడానికి ఇష్టపడటంలేదు. ఫలితంగా తాము నష్టపోతున్నామంటున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆఫ్ లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 15 ప్రభుత్వ, 88 ప్రైవేట్ కళాశాలలు ఉండగా వీటిలో 23వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికేడాది ఈ సీట్ల సంఖ్య తగ్గుతున్నదని, ప్రస్తుతం ఈ సంఖ్య 18 వేలకు పడిపోయిందని ప్రైవేట్ యాజమాన్యాలు చెబుతున్నాయి. సకాలంలో ప్రవేశాలు జరగకపోవడం, ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానం, మార్కులు, రోస్టర్ విధానం వంటివి ఈ పరిస్థితికి కారణం - మిగతా చివరి పేజీలో

## జీవితం మీద ప్రేమ, ధైర్యం

# ఉండేది పిల్లల్లోనే!



> "చేతితో గీసిన ఈ చిత్రాన్ని చూడండి. దీనిని చూసినప్పటి నుంచి నాలో చాలా ఆలోచనలు ఒకదాని తర్వాత ఒకటి కలుగుతూ ఉన్నాయి. ఇది ఒక పన్నెండవ తరగతి చదువుతున్న 'అంశు' అనే విద్యార్థి గీశాడు. దీనిని 'విద్యార్థి చెకుముకి' పత్రిక జూన్ ఎడిషన్‌కు కవర్ పేజీగా వేశారు."

యుద్ధం చేసేందుకు షీల్డ్‌లతో రెడీగా నిలబడి ఉన్న సైనికులు, వాళ్లు షీల్డ్‌ల మీద కుంచెతో అందమైన ప్రకృతిని కుంచెతో గీస్తున్న బాలుడు. ఈ పెయింటింగ్ ఒక స్పష్టమైన మెసేజ్‌ని ఇస్తుంది. యుద్ధం చేయడం పెద్దవాళ్ల పని, పిల్లల లోకంలో యుద్ధమనేదే లేదు. వాళ్లు ఎవరినీ శత్రువులుగా చూడరు, ఏదైనా విద్వేషాన్ని వారి మెదళ్లలో నూరి పోస్తే తప్ప.

యుద్ధం ప్రకృతిని ధ్వంసం చేస్తుంది. బాలుడు ప్రకృతిని సైనికుల షీల్డ్‌ల మీద గీస్తున్నాడు. చెట్లు, పక్షులు, మేఘాలు, ఇంద్రధనుస్సు, ఆటలు, గాలి పటాలు, సాయంకాలంలో నవ్వుతుండే సూర్యుడు. ఇదంతా ఒక అందమైన ప్రపంచం, పిల్లల ప్రపంచం. పెద్దవాళ్ల యుద్ధం ప్రపంచానికి, పిల్లల అందమైన ప్రపంచానికి మధ్య సైనికుల షీల్డ్‌లు.

సైనికుల హృదయాలను తమ కరకుతనం కింద దాచిపెట్టే షీల్డ్‌లను అందమైన షీల్డులుగా మార్చడం వలన ఈ యుద్ధం ఆరోగ్యకరమైన వాతావరణం కోసమే అనిపిస్తుంది. ఇపుడు యుద్ధం చేయవలసింది, సైనికులుగా మారవలసింది మారణాయుధాలతో చంపుకోవడం కోసం కాదు.. మళ్లీ సుందరమైన ప్రపంచాన్ని నిర్మించుకోవడం కోసం. అందుకే సూర్యుడిని ప్రపంచ శాంతి చిహ్నంగా మార్చేశాడు. సూర్యుడంటే విప్లవం. ఈ విప్లవం ప్రకృతి కోసం ప్రకృతి సంరక్షించుకోవడం కోసం.

***మరొకటి కూడా అనిపించింది...***

భయంకరమైన యుద్ధాన్ని, మారణాయుధాలను అందమైన ప్రకృతి చిత్రాలతో నింపడం మోసం. బహుశా యుద్ధపిపాసులు ఇటువంటి చిత్రాలను అభినందించవచ్చు కూడా. ఎందుకంటే ఇవి అసలు నిర్మాణాన్ని ప్రశ్నించవు. కేవలం పైపై పూతలకు, శాంతి వచనాలనబడే మోసపూరిత ఎత్తులకూ ప్రజలను అలవాటు చేయడం. ఆల్టర్నేటివ్ మైల్డ్ ఒపీనియన్ ద్వారా తీవ్రతను పలుచన చేయడం.

ప్రతీ ఒక్కరు ప్రపంచ శాంతి గురించి, అహింస గురించి, సహనం గురించి, ప్రకృతి గురించి, పర్యావరణ పరిరక్షణ గురించి, మాట్లాడుతూనే ఉన్నారు. కానీ యుద్ధాలు ఆగడం లేదు. అవి ఆగవని అందరికీ తెలుసు. అందుకే ఎవరికి వారు ఇలాంటి సుందరమైన నోస్టాల్జిక్ బొమ్మలు గీసుకుంటూ తృప్తిపడతారేమో. ఇదొక నిస్సహాయతను సూచించే చిత్రం కూడా. ఇంకేమీ చేయలేక చివరికి షీల్డ్‌ల మీద ప్రకృతిని గీసుకుని తృప్తి పడే సందర్భంలో ఉన్నామేమో.

పిల్లలు ఏ ఐడియాలజీతో కూడా ఇంకా అవగాహన లేదా స్పృహ కలిగి ఉండకపోవచ్చు. ఇలా ఏ స్పృహ లేకపోవడం కూడా మరొకరి ఐడియాలజీకి వాహకులుగా వాడబడటమే. మా పిల్లవాడు అమాయకుడు, కానీ వాడు అమాయకుడిలా పెద్దయ్యాక కూడా ఉండిపోవడమే అసలైన ఐడియలాజికల్ ట్రిక్. ఐడియాలజీలో నీవేం ఆలోచిస్తున్నావనేది ఏ మాత్రం ప్రాధాన్యత లేని అంశం. కానీ నీవు చేసే పని సిస్టమ్‌ని ఎలా ప్రభావితం చేస్తుందన్నదే అసలైన అంశం. ఇపుడు ఐడియలాజికల్ నినాద ప్రియత్వం కూడా పచ్చి నిష్క్రియా పరత్వం. అది సిస్టమ్‌ని అణువంత కూడా ప్రభావితం చేయదు. ఏ పనీ చేయనవసరం లేదు. ఒక స్లోగనిస్తూ నిలబడిపోవటం చాలనే ధోరణి. పైగా సోషల్ మీడియాలో పోస్టేస్తే సరి. 'ఏయ్ సైనికుల్లా రా! మీరూ ఒకప్పుడు పిల్లలే! గుర్తుపెట్టుకోండి'. అని గుర్తుచేసి ఏంలాభం.

అసలు అడగవలసినది నీ షీల్డ్ మీద అందమైన చిత్రం ఎందుకు లేదు అని కాదు. అసలు సైనికుడిగా నీ అవసరం ఏంటి? అని. మనం యుద్ధాలను నిర్మించుకున్నామంటేనే ప్రేమ లేకుండా ఉన్నామని. పిల్లలకు జియో పాలిటిక్స్ తెలియదు. దేశమంటే, బౌండరీలంటే వాళ్లకు చాలా తక్కువ అవగాహన ఉంటుంది. కానీ మనం వాళ్లని చంపుతున్నాం యుద్ధాల్లో. యుద్ధాలంటే ద్వేషమంటే ఏంటో తెలియని వాళ్లని చంపడం అంటే మనిషిగా దిగజారిపోవడం కాక మరేమిటి. పిల్లలను అందర్నీ చంపేస్తామని ప్రకటనలిస్తున్న నాయకులు అసలు మనుషులేనా? ఎంత అన్యాయం ఇది. ఈ ప్రపంచంలోకి పిల్లలను ఎందుకు తెస్తున్నట్టు. యుద్ధాలతో ద్వేషాలతో చంపేందుకా? జంతువులు ఎందుకు ఇలా లేవు?

ధైర్యాన్ని నేర్చుకోవాలి. అదే సైనిక శిక్షణ. ఏ ధైర్యం నేర్చుకోకుండా స్వచ్ఛంగా స్వచ్ఛందంగా వచ్చి సైనికుడి షీల్డ్ మీద బొమ్మ గీస్తున్న బుడతడు. రెండు రకాల ధైర్యాల మధ్యన గీతలాగా షీల్డ్. ఇటువైపు ప్రేమ, ప్రకృతి. అటువైపు ద్వేషం, రక్తం.

కానీ చివరిగా ఒక యుద్ధ సైనికుడి ముందు నిష్కల్మషమైన మనసుతో ప్రకృతి బొమ్మ గీస్తున్న బుడతడు. అన్ని షీల్డ్‌లను కలిపితే ఒకే పెద్ద అందమైన ప్రకృతి చిత్రం అవుతుంది. ప్రకృతిని ముక్కలు చేస్తుంటే దాని ముక్కలను అతికించేందుకు షీల్డ్‌లను ఎంచుకున్నాడు. వేరే మార్గం లేదు.

విరించి విరివింటి

- కమిషనర్ బంగ్లా పక్కనే కార్ల షెడ్డు
- చిన్నబరాటంవీధి, టౌన్‌హాల్ రోడ్డు, కళింగ రోడ్డుల్లో ట్రాఫిక్‌జామ్
- పాడైపోయిన కార్లకు ఈ రోడ్డే యార్డు
- పోలీసులొచ్చినా స్పందించని యాజమాన్యం

# ఆ రోడ్డు..




# అడుగేయడానికి కూడా అడ్డు!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మీరుంటున్న ఇళ్ల మధ్యలో ఒక డంపింగ్ యార్డు ఉంటే ఎలా ఉంటుంది? మీ వీధి మొదట్లో ఐరన్ స్క్రాప్ గొడౌన్ రోడ్డుపైనే స్టాక్ పెడితే ఎలా ఉంటుంది? కానీ మున్సిపల్ కమిషనర్ బంగ్లాకు ఆనుకొని ఎంహెచ్‌వో క్వార్టర్స్ వరకు మున్సిపాలిటీ రోడ్డును పూర్తిగా స్క్రాప్ కార్ల కోసం, బ్యాటరీ రిపేర్ల కోసం, ఏసీ మరమ్మతుల కోసం వాడుకుంటే మాత్రం మున్సిపల్ యంత్రాంగానికి, మన ట్రాఫిక్ పోలీసులకు ఏమాత్రం ఇబ్బందిగా ఉండదు. ఎందుకంటే.. ఈ రోడ్డు నుంచి మున్సిపల్ అధికారులెవరూ ప్రయాణం చేయరు. పోలీసులు కూడా ఈ రోడ్డు మీదే తమ వాహనాలను రిపేరు చేయిస్తుంటారు.

ఎక్కడో ఊరి శివారున ఉండాల్సిన ఒక కార్ గ్యారేజ్ నగరం నడిబొడ్డులో ఉంది. మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకు తీసుకొని కార్ల రిపేర్ల సెంటర్‌ను నడుపుతున్నారు. ఒకటో రెండో కార్లయితే ఇబ్బందిలేదు. కానీ ఈ రోడ్డంతా ఇక్కడ రిపేర్లకు వచ్చిన కార్లతోనే నిండిపోతుంది. మరోవైపు ఇక్కడే ఎరువుల దుకాణాలు, పెయింటింగ్, ఫర్నిచర్ షాపులు, గేట్లు, గ్రిల్స్ తయారుచేసే దుకాణాలు ఉండటంతో పెద్ద పెద్ద వాహనాలు వచ్చి నిల్చుంటున్నాయి. అన్నిటికీ మించి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలంటే వాటిని ఇక్కడే నిలిపి నింపాలి. వీటన్నింటి వల్ల మున్సిపల్ కార్యాలయం వెనుక, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో టౌన్‌హాల్‌కు వెళ్లే మార్గం పూర్తిగా మూతబడిపోయింది. మూడు వేల రూపాయల అద్దెకు దిగిన ఒక ఆసామి ఆ తర్వాత అదే షాపును రూ.15 వేలకు దక్కించుకొని కార్లు బాగుచేసే వ్యాపారాన్ని పెట్టుకున్నాడు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. కాకపోతే బాగుచేసినా కదల్లేని పరిస్థితుల్లో ఉన్న కార్లను కూడా ఈ రోడ్డు మీదే నిలిపేయడం, కొత్తగా రిపేర్లకు వచ్చిన కార్లను ఆ పక్కన పార్క్ చేయడం వల్ల ఇక్కడ ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. మొదట్లో వీరు కార్లలో ఉండే బ్యాటరీ బలహీనపడిపోయి కారు ఆగిపోతే దానికి బూస్టింగ్ ఇచ్చే - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ఎమర్జెన్సీ ఘోరకలికి అర్ధశతాబ్ది

**1975** జూన్ 25.. దేశ చరిత్రలో చీకటి పేజీలు తెరిచిన రోజు. అడ్డూఅదుపూ లేని నాంది పలికిన రోజు. ప్రజాస్వామ్యమనే స్త్రీమూర్తికి సంకెళ్లు వేసి అమానుషంగా అత్యాచారం చేసిన రోజు. ఆ చీకటిపర్వానికి తెరలేచి నేటికి సరిగ్గా 50 ఏళ్లు. ఏకంగా 635 రోజులపాటు అంటే 21 నెలలు విశృంఖల పాతకానికి తెగబడిన నాటి ఎమర్జెన్సీ అకృత్యాల గురించి ఈ తరాలవారికి తెలియకపోవచ్చు. కానీ అప్పటి తరంవారిని ఎమర్జెన్సీ గురించి కదిలిస్తే చాలు.. వణికిపోతారు. కానీ వాటి గురించి చెబితే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని ఘనంగా చెప్పుకొనే భారత్‌లోనే అంతటి దారుణ పాలన జరిగిందా? అని నేటి జనరేషన్ ఆశ్చర్యపోతారనడం అతిశయోక్తి కాదు. అప్పటివరకు దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన ఆధిపత్యానికి ముప్పు తెచ్చే పరిణామాలను తట్టుకోలేక దేశానికి ఎమర్జెన్సీని రుచి చూపించారు. నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ద్వారా రాజ్యాంగంలోని 352వ అధికరణం కింద దేశవ్యాప్తంగా అత్యయిక పరిస్థితి(ఎమర్జెన్సీ) విధిస్తూ 1975 జూన్ 25న ఉత్తర్వులు జారీ చేయించారు. అది మొదలు 1977 మార్చి 21 వరకు దేశం యావత్తు చీకటి పాలనలో మగ్గిపోయింది. ప్రధానంగా నాలుగు కారణాలు ఇందిరను ఎమర్జెన్సీ విధింపునకు ప్రేరేపించాయి. 1973లో ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్ పై విద్యార్థి ఉద్యమం ఎగిసిపడింది. దాంతో 1974 ఫిబ్రవరిలో గుజరాత్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన ఇందిరా గాంధీ రాష్ట్రపతి పాలన విధించారు. ఆ తర్వాత 1975లో జరిగిన ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ ఓడిపోయింది. రెండో అంశం బీహార్‌లో సోషలిస్టు నేత జయప్రకాష్ నారాయణ్(జేపీ) ఉద్యమాలు. తొలుత అక్కడి విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్న ఆయన తర్వాత ఇందిర పాలనకు వ్యతిరేకంగా సంపూర్ణ క్రాంతి (సంపూర్ణ విప్లవం) ఉద్యమానికి పిలుపునిచ్చారు. కార్మిక నాయకుడు జార్జి ఫెర్నాండేజ్ సారథ్యంలో 1974లో అఖిల భారత రైల్వే సమ్మె జరిగింది. దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థ స్తంభించిపోవడం అదే తొలిసారి.. చివరిసారి కూడా. ఆ సమయంలోనే ఆనాటి రైల్వే మంత్రి ఎల్ఎన్ మిశ్రా బాంబు దాడిలో మరణించగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. చివరిది అన్నింటికంటే కీలకమైనది ఎంపీగా ఇందిర ఎన్నిక చెల్లదంటూ కోర్టు తీర్పు ఇవ్వడం. 1971లో ఇందిరాగాంధీ రాయ్‌బరేలి నుంచి ఎంపీగా గెలిచి, ప్రధాని పదవి చేపట్టారు. ఆమెపై పోటీ చేసి ఓడిపోయిన సోషలిస్టు నేత రాజ్‌నారాయణ్ ఇందిర అక్రమాలకు పాల్పడి గెలిచారంటూ అలహాబాద్ హైకోర్టులో కేసు వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు ఇందిరను దోషిగా తేల్చి, ఆమె ఎన్నిక చెల్లందంటూ 1975 జూన్ 12న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై జూన్ 24న సుప్రీంకోర్టు పాక్షిక స్టే విధించింది. ఓటింగ్ హక్కు లేకుండా ప్రధానిగా కొనసాగడానికి మాత్రమే ఇందిరకు అనుమతినిచ్చింది. వాస్తవంగా దేశంలో అస్థిరత, అశాంతి, సరిహద్దుల్లో కల్లోలాలు, అంతర్గత సంక్షోభం వంటి తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తిన సందర్భాల్లో మాత్రమే ఎమర్జెన్సీ అస్త్రాన్ని ప్రయోగించాలని రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. కానీ దేశంలో అటువంటి పరిస్థితులు లేకపోయినా.. కేవలం తన అధికారానికి ముప్పు వాటిల్లడాన్ని సహించలేకే ఇందిర నాడు దేశానికి ఎమర్జెన్సీ సంకెళ్లు తొడిగి.. ప్రజలను తీవ్ర నిర్బంధాలకు గురిచేసింది. దేశ పౌరులు ప్రాథమిక హక్కులు కోల్పోయారు. ఇందిరా గాంధీ. ఆమె తనయుడు సంజయ్‌గాంధీ, కొద్దిమంది కోటరీ సభ్యుల ఇష్టానుసారం నిబంధనలు మారిపోయాయి. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, మధు దండావతే, జార్జి ఫెర్నాండేజ్ వంటి వందలాది రాజకీయ ఉద్దండులతో పాటు లక్షలాదిమంది జైళ్లపాలయ్యారు. పత్రికా స్వాతంత్ర్యం హరించుకుపోయింది. పత్రికల్లో ప్రచురించే ప్రతి అక్షరం ప్రధాన మంత్రి కార్యాలయం రావాల్సిందే. ప్రభుత్వాన్ని విమర్శించిన పత్రికలు నిషేధానికి గురయ్యాయి. సంజయ్‌గాంధీ దేశంలో నిర్బంధ కుటుంబ నియంత్రణ అమలు చేశారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా మన రాజ్యాంగానికి గుండెకాయలాంటి పీఠికను మార్చేసి సోషలిస్ట్, సెక్యూలర్, ఇంటిగ్రిటీ అనే పదాలు చేర్చారు. ఎమర్జెన్సీ కాలంలో 1,10,806 లక్షల అరెస్టులు జరిగాయి. నిరసనకారులపై కాల్పులు, కస్టడీ మరణాలు, నిర్బంధ కు.ని. వంటి కారణాలతో సుమారు వెయ్యి బలవన్మరణాలు నమోదయ్యాయి. ఆర్థిక వ్యవస్థ పతనమైంది. ద్రవ్యోల్బణం 29 శాతానికి ఎగబాకింది. జీడీపీ వృద్ధిరేటు 0.9 శాతానికి పడిపోయింది.

## ఎమ్మెల్యేను కలిసిన పెన్షనర్స్ అసోసియేషన్



(సత్యంన్యూస్, రణస్థలం)

రణస్థలం, లావేరు మండలాలకు చెందిన సుమారు 400 మంది ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం క్యాంప్ కార్యాలయంలో వారు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షులుగా పిన్నింటి సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా మాడుగుల రామారావు, ఉపాధ్యక్షులుగా బాలి రామునాయుడు, సహా కార్యదర్శిగా మన్నె కృష్ణానందం తదితరులు ఎన్నుకోబడినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ కొరకు ఎమ్మెల్యేకు అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేయగా ప్రభుత్వం తరుపున మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సచివాలయం ఉద్యోగుల బదిలీల్లో మహిళా పోలీసులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో మహిళా పోలీసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బమ్మిడి అమ్మోజీ తదితరులున్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం



## ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలని వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావులు మాట్లాడుతూ భారత్ అవలంబిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమని దుయ్యబట్టారు. ఇరాన్‌పై దాడితో క్రూడాయిల్ సంక్షోభం వస్తుందని, దేశ ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయని విమర్శించారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఇరాన్‌పై దాడులు అమెరికా స్వప్రయోజనాల కోసమేనని, ప్రపంచ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన అవసరం లేదన్నారు. భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ప్రతి కష్టసమయంలోనూ భారత్‌కు మద్దతు ఇస్తోందని తెలిపారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెబుతోందని విమర్శించారు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని, తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయని ఈ సందర్భంగా తెలిపారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్పిటి)పై ఇరాన్ సైతం సంతకం చేసిందని పేర్కొన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిందని, ఈ దాడులకు అమెరికా కూడా ఇజ్రాయిల్‌తో చేతులు కలిపిందని దుయ్యబట్టారు. దౌత్య చర్చలకు రెండు వారాల సమయం ఇస్తున్నానని ప్రకటించిన అమెరికా కేవలం రెండు రోజుల్లోనే దాడులు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టం అవుతోందన్నారు. ఈ దాడి ప్రపంచశాంతి పైన, సాధారణ ప్రజల జీవనోపాధిపైన తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. చమురు దిగుమతులు, వలస కార్మికులకు అవకాశాల కోసం పశ్చిమాసియాపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోందని, అభివృద్ధి చెందుతోన్న దేశాలపై ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్.ప్రకాశరావు, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, ఎం.ఆదినారాయణమూర్తి, టి.తిరుపతిరావు, ఎ.లక్ష్మి, బి.సంతోష్, ఆర్.అరవింద్, ఎ.సోమశేఖర్, పి.జగ్గారావు, పి.జనార్ధనరావు, ఎన్.సంతోష్, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## 26న జిల్లా స్థాయి చైల్డ్ అండ్ మినీ ఫెన్సింగ్ పోటీలు

**- అండర్ -10 ,అండర్ -12విభాగాల రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకి ఎంపికలు**

**- శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వేదికగా ఈ నెల 26న (గురువారం) జిల్లా స్థాయి చైల్డ్ అండ్ మినీ ఫెన్సింగ్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ పోటీలను నిర్వహించనున్నట్లుగా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. అండర్ –10( చైల్డ్), అండర్–12(మినీ) విభాగాలలో బాలురు, బాలికలకి వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ పోటీలలో పాల్గొనదలచే బాలబాలికలకు చెల్లుబాటు అయ్యే ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. అండర్ –12(మినీ) విభాగంలో పోటీలలో పాల్గొనే అభ్యర్థులు జనవరి 1,2014లేదా తర్వాత జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. అలాగే అండర్ –10( చైల్డ్ ) విభాగంలో పాల్గొనేవారు జనవరి 1,2016 లేదా తర్వాత జన్మించిన వారే అర్హులని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు వ్యక్తిగత ఫెన్సింగ్ కిట్‌తో హాజరుకావాలని, పుట్టిన తేది ధృవీకరణ కోసం డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్, అడ్రస్ ప్రూఫ్ కోసం ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీని ఈ సెల్‌నెంబర్‌లో 7660874844 సంప్రదించాల్సిందిగా జిల్లా అధ్యక్షుడు బలభద్రుని రాజా కోరారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన వారిని ఈ నెల 29 న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేసారు.






బాలీవుడ్ స్టార్ దిశా పటానీ తన ఇటీవలి ఫోటోడంప్‌లో స్టైల్‌ను చంపేస్తోంది. ఈ కల్కి నటి తన స్టైల్‌తో ప్రజలను ఆశ్చర్యపరుస్తుంది. ఇంతలో ఆమె ఇటీవల ముంబై విమానాశ్రయంలో ఊహించని పరిస్థితిని ఎదుర్కొంది. తన గ్లామరస్ లుక్స్, ప్రముఖ చిత్రాలకు పేరుగాంచిన నటిని టెర్మినల్‌లోకి ప్రవేశించకుండా ఆపివేసి ఇంటికి తిరిగి రావలసి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఆమె త్వరలో అక్షయ్ కుమార్, సునీల్ శెట్టి, అనేకమందితో కలిసి “వెల్‌కమ్ టు ది జంగిల్” అనే హాస్య చిత్రంలో కనిపించనుంది.- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## రష్మిక ప్లేస్‌కి ఎసరు పెడుతుందా?

కన్నడ పరిశ్రమలో ఆరేళ్ల క్రితమే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది అందాల భామ రుక్మిణి వసంత్. హిందీలో అప్ స్టార్స్ అనే సినిమాలో ఎన్.జి.ఓ గర్ల్‌గా కనిపించిన రుక్మిణి కన్నడలో బర్ బల్ ట్రియాలజీ కేస్ 1 ఫైండింగ్ వజ్రముని సినిమాలో నటించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి రక్షిత్ శెట్టి సప్త సాగరాలు దాటి సినిమాలో ఛాన్స్ పట్టేసింది. సప్త సాగరాలు దాటి రెండు భాగాల్లో రుక్మిణి వసంత్ యాక్టింగ్ అదరగొట్టేసింది. సినిమాలో ఆమెను చూసిన యూత్ ఆడియన్స్ అంతా ఆమెకు ఫిదా అయ్యారు. సప్త సాగరాలు దాటి సినిమా తర్వాత రుక్మిణి వసంత్ సౌత్ ఆడియన్స్ కి హోలిలిట్ ఫేవరెట్ అయ్యింది. అమ్మడికి వరుసగా ఇతర భాషల నుంచి ఛాన్స్‌లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళ్ లో విజయ్ సేతుపతితో ఏస్ సినిమా చేసిన రుక్మిణి వసంత్ శివ కార్తికేయన్‌తో మదరాసి సినిమాలో కూడా అవకాశం అందుకుంది. ఇక తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో వచ్చినా ఆ సినిమా ఎవరు పట్టించుకోలేదు. లేటెస్ట్‌గా అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. నీల్ తో సినిమా అది కూడా ఎన్టీఆర్ లాంటి స్టార్‌తో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. తప్పకుండా రుక్మిణి సౌత్ సినిమాల్లో తన ఇంపాక్ట్ గట్టిగా చూపించేలా ఉందని అనిపిస్తుంది. తనకు యూత్ ఆడియన్స్ లో ఏర్పడిన క్రేజ్ చూస్తే సరిగ్గా ఒక్క బ్లాక్ బస్టర్ పడితే ఇక అమ్మడిని తీసుకెళ్లి టాప్ ప్లేస్ లో పెట్టేలా ఉన్నారు. ఆల్రెడీ కన్నడ నుంచి వచ్చి రష్మిక టాలీవుడ్ ని మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ సెన్సేషన్ గా మారింది. ఇక ఇప్పుడు రష్మిక తర్వాత రుక్మిణి అదే రేంజ్ ఫాం కొనసాగించాలని చూస్తుంది. రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టే ప్లానింగ్ లో భాగంగానే రుక్మిణి స్టార్ ఛాన్స్ లు పట్టేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా తప్పకుండా రుక్మిణికి ఆ ఛాన్స్ ఉందనే అనిపిస్తుంది. రుక్మిణి వసంత్ చేస్తున్న ఎన్టీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొడితే మాత్రం అమ్మడికి ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఇదే కాదు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా లైన్ లో ఉన్నట్టు తెలుస్తుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## ‘కన్నప్ప’.. అంతా రిస్కే!

కన్నప్ప’ అనేది మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమా మొదలెట్టేముందు ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. నమ్మకాల్లేవు. ‘ఓ భారీ పాన్ ఇండియా సినిమాగా తీస్తున్నా’ అన్నప్పుడు కూడా పెద్దగా పట్టించుకోలేదు. కానీ క్రమంగా ఈ ప్రాజెక్ట్ లోకి ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ లాంటి వాళ్లు ఎంట్రీ ఇచ్చారు. దాంతో ఈ సినిమా గురించి మాట్లాడుకోవడం మొదలెట్టారు. తనని ట్రోల్ కి గురి చేస్తున్నా, వెటకారంగా కామెంట్లు చేస్తున్నా విష్ణు పట్టించుకోలేదు. తన పని తాను చేసుకొంటూ వెళ్లాడు. దాదాపు రూ.200 కోట్లు ఖర్చు పెట్టి తీశాడు. ఇది విష్ణు కెరీర్‌కి పెద్ద రిస్క్. విష్ణుకి అంత మార్కెట్ లేదన్నది నిజం. ఈ సినిమా వర్కవుట్ అవ్వాలంటే ప్రభాస్ ఫ్యాన్స్ సాయం పట్టాలన్నది నిజం. ప్రభాస్ పాత్ర రెబల్ అభిమానులకు నచ్చితే పంట పండినట్టే. కాకపోతే ఈ సినిమా ఓటీటీ హక్కులు అమ్మలేదు. ఆడియో రైట్స్ అమ్మలేదు. ఏరియాల వారీగా అమ్మలేదు. రూ.200కోట్లకు రూ.200కోట్లూ రిస్కే. సినిమా బాగుంటే, మంచి టాక్ వస్తే ప్రతీ పైసా తిరిగి వస్తుందన్న నమ్మకంతో ఈ సినిమాని ఇంత రిస్క్ పెట్టి రిలీజ్ చేస్తున్నాడు విష్ణు. ప్రమోషన్లు కూడా గట్టిగానే చేశాడు. అయితే ప్రభాస్ ఒక్క ఈవెంట్ కు వచ్చినా బాగుండేది. ప్రభాస్‌తో ఓ కామన్ ఇంటర్వ్యూ చేసి బయటకు వదులుదాం అనుకొన్నారు. కానీ అది కూడా కుదర్లేదు. ఈ సినిమాలో ఇంతమంది స్టార్లు ఉన్నా.. తానొక్కడై మోశాడు విష్ణు. కన్నప్ప విడుదలకు ఇంకా ఒక్క రోజే సమయం ఉంది. ఈరోజు అడ్వాన్స్ బుకింగులు మొదలు కాబోతున్నాయి. ప్రీమియర్లు వేయాలని విష్ణు భావించినా, ఆ ఆలోచన ఇప్పుడు విరమించుకొన్నట్టు తెలుస్తోంది. అడ్వాన్స్ బుకింగులు, ట్రెండ్‌ని బట్టి అసలు కన్నప్ప చూడాలన్న ఆలోచన సినిమా ప్రేక్షకులకు ఉందా, లేదా? అనేది తేలిపోతుంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# జగన్‌ది అంతా రాజకీయ ఉన్మాదమే!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిది అంతా రాజకీయ ఉన్మాదమేనని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జనసేన పార్టీ నాయకులు పిసిని చంద్రమౌళి, దానేటి శ్రీధర్‌లు విమర్శించారు. ఈమేరకు బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయాలంటే ప్రజల కోసం పని చేస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవాళ్లు, ఉన్నతస్థానాల్లో పనిచేసిన వాళ్లు మరింత బాధ్యతగా, జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందన్నారు. దురదృష్టవశాత్తూ ముఖ్యమంత్రిగా పనిచేసి, ఒక పార్టీని నడుపుతున్న వైఎస్ జగన్ తీరు దారుణంగా ఉంటోందన్నారు. కనీస మానవత్వం లేకుండా, ప్రజల ప్రాణాల కంటే తన రాజకీయ లబ్ధికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీని కోసం హింసకు దిగడంతో కాదని, ప్రజల ప్రాణాలు, కార్యకర్తల ప్రాణాలు సైతం తీస్తున్నారన్నారు. ప్రతి అంశాన్ని, ప్రతి పర్యటనను రాజకీయంగా వాడుకోవాలనే ఉద్దేశ్యంతో జగన్ సొంత వ్యూహాలను, కుట్ర వ్యూహాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో జగన్ చేసిన షో కారణంగా ఇద్దరు వైసీపీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారన్నారు. బెట్టింగ్‌లో ఏడాది క్రితం ఆత్మహత్యకు పాల్పడిన వాడికి విగ్రహం పెట్టడమే కాకుండా ఆ విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారన్నారు. పరామర్శ పేరుతో పర్యటన చేసి మరో ఇద్దరిని బలితీసుకున్న వ్యక్తిని ఏమంటారో ఆయనకే తెలియాలన్నారు. సింగయ్య కారు కింద పడినా పట్టించుకోలేదన్నారు. స్వయంగా వాహనంపై ఉండి ఘటన తెలిసి కూడా జగన్ కారు దిగి స్పందించలేదన్నారు. ప్రమాదంలో కార్యకర్త చనిపోయాడని తెలిసి కనీసం మానవత్వం చూపని వ్యక్తి జగన్ అని విమర్శించారు. పైగా కనికరం లేకుండా ముళ్ల పొదల్లోకి లాగిపడేసి నవ్వుకుంటూ జేజేలు కొట్టించుకుంటూ వెళ్ళిపోయారన్నారు. ఇటువంటి వ్యక్తులు రాజకీయాలకు అనర్హులుగా మిగిలిపోతారన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కోడి కత్తి, గులకరాయి డ్రామాలో దళిత యువకులను బలిచేశారన్నారు. సొంత బాబాయి హత్య కేసును కూడా అధికార దాహం కోసం వినియోగించుకున్నారన్నారు.

## పట్టాలిచ్చిన పేదలకు భూములు అప్పాజెప్పాలి



(సత్యంన్యూస్, పాలకొండ)

2008-09 సంవత్సరంలో వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామంలో 151మంది పేదలకు పట్టాలు ఇచ్చినప్పటికీ భూములు అప్పగించలేదని ఆనాటి నుంచి నేటి వరకు లబ్ధిదారులైన పేదలు అనేక పర్యాయాలు స్థానిక తహసిల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి పాలకొండ, ఉమ్మడి జిల్లా శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేసి చివరగా భూములు లబ్ధిదారులకు పంచేందుకు సిద్ధమైన తరుణంలో మళ్లీ వాయిదా పడిందన్నారు. అప్పట్నుంచి ఇప్పటివరకు పేదలు పలుమార్లు తమ హక్కుగా ఉన్న భూముల కోసం ఆందోళన చేస్తూ అందులో భాగంగా బుధవారం స్థానిక వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై వారు స్పందిస్తూ వాస్తవ విషయాలను పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముందుగా పట్టాదారులైన పేదలతో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, పాలకొండ నియోజకవర్గం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స మోహన్‌రావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామ రెవిన్యూ పరిధిలో 2008-09 సంవత్సరంలో 151మందికి సుమారు ఎకరం భూమి చొప్పున ఆనాటి రెవెన్యూ అధికారులు ఎంపిక చేసిన అర్హులైన పేదలకు పట్టాలిచ్చారన్నారు. కానీ నేటికీ ఆ భూమిని పట్టాదారులకు పంచలేదన్నారు. ఆ పట్టాదారులలో ఇప్పటివరకు అనేకమందికి రైతుభరోసా ఇతర ప్రభుత్వ పథకాలు అందుకొని లబ్ది పొందుతున్నారన్నారు. పట్టాలు పేదల చేతిలో ఉన్నాయి గాని భూములను అధికారులు పేదలకి దాఖలు పరచడం లేదన్నారు. కార్యక్రమంలో నర్సిపురం గ్రామ అర్హులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత 42 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. కార్మికుల సమ్మె సందర్భంగా జరిగే ఏ కార్యక్రమంలో అయినా తాము కలిసి పాల్గొంటామని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. మాజీ డిసిసి అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ పరమేశ్వరరావు, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్చార్జ్ సనపల అన్నాజీరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్ మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గోవిందమల్లిబాబు ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్చార్జి కరిమజ్జి మల్లేశ్వరరావు పాతపట్నం నియోజకవర్గ ఇన్చార్జి మజ్జి మురళీమోహన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, బస్వా షణ్ముఖరావు, లఖినేని నారాయణరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొర్రాయిప్రసాద్, కొత్తపల్లి రాంప్రసాద్, బాలయ్య, రవికుమార్, పి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు



## అంబటి క్రిష్ణారావుపై కాంగ్రెస్ నాయకుల చార్జ్‌షీట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంబటి కృష్ణారావుపై ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు చార్జిషీట్ ప్రకటించారు. అంబటి కృష్ణారావు పనితీరు పార్టీ వినాశనానికి తోడ్పడుతుందని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన డిసిసి అధ్యక్షులు జిల్లాలో పార్టీ సీనియర్ నాయకులను పక్కన పెట్టి తన ఇష్టానుసారము ప్రవర్తించడం తగదని, వారు ఒక తీర్మానం చేశారు. బుధవారం శ్రీకాకుళం డీసీసీ కార్యాలయంలో శ్రీకాకుళం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు అనేక తీర్మానాల్ని ఆమోదించి పార్టీ అధిష్టానానికి పంపించేందుకు నిర్ణయించారు. ఇటీవల పిసిసి అధ్యక్షులు షర్మిల పర్యటన గూర్చి తమకు ముందుగా తెలియజేయలేదని, కనీసం ఏ ఒక్కరికి సీనియర్ నాయకులకు సమాచారం కూడా ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. డిసిసి అధ్యక్షుని పనితీరుని వ్యతిరేకిస్తూ ఆయనపై ఫిర్యాదు చేయడం పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పట్టంగా అధిష్టానాన్ని వ్యతిరేకించేదిగా కృష్ణ చిత్రీకరించడం, ఈ విధంగా నాయకత్వానికి తెలియజేయడం సరికాదని వారు తీర్మానించారు. అంబటి కృష్ణ పని తీరుపై పీసీసీ దర్యాప్తుకు పూనుకోవటం ఆహ్వానించదగ్గ పరిణామం అని వార తీర్మానంలో పేర్కొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం ఆర్థిక కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఇందిరా విజ్ఞాన్‌భవన్‌ట్రస్ట్ పేరుతో ఒక ట్రస్ట్ ఉండదా డిసిసి అధ్యక్షులు ట్రస్ట్‌ను ఖతర్ చేయకుండా ట్రస్టు సభ్యులకు ఏమాత్రం చెప్పకుండా ఇష్టానుసారంగా సుమారు 20 లక్షల రూపాయలు ఆర్థిక అరాచకానికి పాల్పడటం పట్ల జరుపుతున్న విచారణను పారదర్శకంగా కొనసాగించాలని తక్షణం జిల్లా పార్టీ శ్రేణులకు న్యాయం చేయాలని వారు ఆ తీర్మానంలో పేర్కొన్నారు. తాము కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం కాదని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేందుకు నిరంతరం కృషి చేస్తున్న తమని డిసిసి నిత్యం అవమానిస్తూ, కేసులు పెడుతూ వేధిస్తున్న పార్టీ పెద్దలు ఈ విషయమై పట్టించుకోకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా విజ్ఞాన భవన్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ వారు మరో తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఫోన్ బిల్లు, త్రాగునీటి ఖర్చులు, పెట్రోల్ ఖర్చులు కనీసం చెల్లించకుండా వేలాది రూపాయలు బకాయిలు ఉంచి అద్దె డబ్బుల్ని తన సొంతానికి వాడుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా అధ్యక్షుడిపై తగు చర్య తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, ఆమదాలవలస నియోజకవర్గం ఇన్చార్జి సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, పాతపట్నం మజ్జి మురళీమోహన్ ఎచ్చెర్ల కరిమజ్జి మల్లేశ్వర రావు, ఆముదాలవలస నియోజకవర్గాల నాయకులు బస్వా షణ్ముఖరావు లఖినేన నారాయణరావు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొర్రాయి ప్రసాద్ రావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, కొత్తపల్లి రాంప్రసాద్, దాలయ్య, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు



## ఆదివాసుల అభ్యున్నతి కూటమి ప్రధాన లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


పాతపట్నం నియోజకవర్గం హిరరమండలం మండలం మర్రిగూడ గ్రామంలో నియోజకవర్గ గిరిజన సంక్షేమ, అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వ పథకాలైన పీఎం జన్మన్, దరిత్రి అభ జంజతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ మొదలగు పథకాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పథకాల అమలతీరును గిరిజనులకు క్షుణ్ణంగా వివరించారు. సదరు పథకాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాలని అందుకోసం సంబంధిత అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు అయ్యేలా చూడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో పీఎం జన్మన్, దరిత్రి అభ జంజతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకాలను గిరిజనులు వినియోగించుకోవాలన్నారు. ఈ పథకాల క్రింద దరఖాస్తు చేసుకున్న వారికి కమ్యూనిటీ,ఆదాయ, ఆధార్ మొదలగు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ స్పెషలాఫీసర్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పరిసర ప్రాంత గిరిజనులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో మెరిసిన వీరభద్ర

(సత్యంన్యూస్, టెక్కలి)

జాతీయస్థాయిలో తమ ఇంజనీరింగ్ విద్యార్థి ఉట్ల వీరభద్ర ప్రతిభ చూపడం ఐతం ఇంజనీరింగ్ కళాశాలకు గర్వకారణంగా ఉందని టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాల సంచాలకులు డాక్టర్.వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఎస్. శ్రీనివాసరావు అన్నారు. "జాతీయ పంచాయతీరాజ్" దినోత్సవం సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యూత్ అసోసియేషన్ జాతీయస్థాయిలో భారతదేశంలో పంచాయతీరాజ్ ప్రాముఖ్యతను వివరించే ఒక నిమిషం నిడివి గల రీల్(వీడియో) పోటీలను నిర్వహించారు. టెక్కలి ఐతం కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో మూడవ సంవత్సరం చదువుతున్న సింగుపురం గ్రామానికి చెందిన ఉట్ల వీరభద్ర తన సొంతస్క్రిప్ట్, డైరెక్షన్, ప్రధాన పాత్రలో పోషించి ఒక గ్రామ మహిళా సర్పంచ్ గ్రామాభివృద్ధికి చేసిన ప్రదర్శన గల ఒక నిమిషం వీడియో సమాజస్పృహకు అద్దంపట్టి జాతీయస్థాయిలో ఉత్తమరీల్‌గా మొదటి బహుమతి పొందింది. కళాశాల యాజమాన్యం చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని వీరభద్ర తెలిపారు. ఉట్ల వీరభద్ర గతంలో "తొలిసారిగా", "సత్య 1", "సత్య 2" వంటి షార్ట్ ఫిల్మ్స్ చేసి యువత మనసు దోచుకున్నారు. ఇండియన్‌ఫిల్మ్ ఫెస్టివల్, బెంగళూర్ వారు నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలో సత్య1, సత్య2 షార్ట్‌ఫిల్మ్స్‌కు గాను ఉత్తమ డైరెక్టర్ అవార్డు గెలుచుకున్నారు. జిల్లాఖ్యాతిని జాతీయస్థాయిలో నిలిపిన సందర్భంగా కేంద్ర పౌరయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎంఎల్‌ఏ గొండు శంకర్, సింగుపురం సర్పంచ్ గొండు ఆదిత్య, కళాశాల యాజమాన్యం, రోటీరియన్ ఎస్.వసంతరావు, పలువురు వీరభద్రను అభినందించారు.




17వ డివిజన్ పరిధి చేపలవీధి ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు మధ్యాన భోజనం పథకంను డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ బస్వా రాజేష్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోష్టిక ఆహారాన్ని సక్రమంగా అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ఎమైన లోటుబాటులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తాను ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా శాఖ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం.



## విద్యుత్ పొదుపు భావితరాల భవిష్యత్తుకు మదుపు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి విద్యుత్ కొరత లేకుండా వుండేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని తీసుకువచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరి 15న దేశంలో గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని శ్రీకాకుళం జిల్లా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షణ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు. బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్యగర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ ఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ భారం నుండి కొంతవరకు ఉపశమనం పొందడానికి పిఎం సూర్యగర్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశంలో ముందుగా కోటి కుటుంబాలకు రూ.75వేల కోట్లు ఖర్చు చేసి సౌరశక్తి ద్వారా విద్యుత్ ను అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని గత ఏడాది ప్రవేశ పెట్టారని ఆయన స్పష్టంచేశారు. ప్రతీ గృహానికిపై కప్పులపై సౌర పలకాలను ఏర్పాటు చేసుకొనుటకు సబ్సిడీ అందిస్తామని, దీని కోసం ప్రత్యేకంగా సురేష్‌కుమార్ అనే నోడల్ అధికారిని నియమించామన్నారు. ఎవరైనా అవసరమనుకుంటే ఆయన ఫోన్ నెంబర్ 94408 12387కు ఫోన్ చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఇంతవరకు సూర్యగర్ పథకం కింద 1599 కనెక్షన్స్ వేశామన్నారు. వీటి అమలుకు జిల్లాలో 22ఏజెన్సీలు ఉన్నాయన్నారు. భావితరాలకు ఆదాతో కూడిన విద్యుత్ అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యగర్ పథకంలో చేరి ప్రతీ ఒక్కరూ విధిగా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వినియోగించాలని ఎస్‌ఈ కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మానవ జీవితంలో పెనువేసుకు పోయిన కరెంట్ లేని జీవితం దుర్భరమన్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ పొదుపుగా విద్యుత్ వాడకం చేయాలని ఆయన కోరారు. ముందుగా స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అడిగిన పలు సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పిజీ గుప్తా, ఎస్.జోగినాయుడు, బీవీ రవిశంకర్, జి.లక్ష్మి, గుడ్ల జగ్గారావు, ఆంకడాల తవిటన్న తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయ ఉమ్మడి కుటుంబానికి చేయూత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిస్సహాయ ఉమ్మడి కుటుంబానికి చేయూతనివ్వాలని, ఆపదలో ఉన్న వారికి, మన శక్తికొలది సాయమందించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. బాధిత ఉమ్మడి కుటుంబానికి నగర సేవకులు అందించిన వంద కేజీల బియ్యపు బస్తాలను రెడ్‌క్రాస్ ఆవరణలో బుధవారం ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు తక్కువగా కనిపిస్తాయని, హేమంత్ కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఒక్కరే ఉండటం బాధాకరమన్నారు. అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్‌కుమార్ గత కొంతకాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న విషయం విదితమే. ఉమ్మడి కుటుంబం, అందులోనూ ఇంటికే పరిమితమౌతున్న హేమంత్ నిస్సహాయునిగా ఉండటం బాధాకరమన్నారు. ఇంటి బాధ్యతను ఆరోగ్యంగా ఉన్న కాలంలో చూసుకునేవాడని, విధి ఆడిన నాటకంలో గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో వైద్యశాలకు తిరుగుతూ, సంపాదనలేక మనోవేదనకు గురౌతున్నారన్నారు. వీరి ఉమ్మడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నగరానికి చెందిన పోలిపిల్లి జయకిరణ్, కోవగణ వాసు, నల్ల గౌతమి, ఆర్మీ పూర్ణచంద్రరావు, ముఖ్యంగా సుసరపు శ్రీలత, నంది ఉమాశంకర్‌లు ముందుకు వచ్చి అండగా నిలిచారన్నారు. ఉమ్మడి కుటుంబ సభ్యులు, సహాయం చేసిన వారికి, సహాయ కారకులు ఉర్లం శివతేజ పట్నాయక్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాధిత కుటుంబసభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బృందంతో పాటు సేవకులు ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ నంది ఉమా శంకర్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్.
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫ్యాషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# నైట్ డ్యూటీలు రద్దు చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, పే స్కేలు అమలుచేయాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని వీఆర్ఏ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అను సత్యనారాయణ కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వీఆర్ఏలు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం వహిస్తోందన్నారు. దళిత నిమ్న కులాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 19,500 మంది వీఆర్ఏలు ఉన్నారని, వారి సమస్యలు పరిష్కరించ కుండా మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.త్రినాధరావు, కె.రమణమూర్తి మాట్లాడుతూ పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం సేవలను ప్రభుత్వం ఉపయోగించుకున్నప్పటికీ వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని, కనీస వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా చేయిస్తున్న నైట్ డ్యూటీలను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.అప్పారావు, బి.రాములమ్మ, ఎన్.సీతప్పుడు, జి.రామ్మూర్తి, లక్ష్మణరావు, జనార్ధనరావు, బి.అప్పారావు, మీనాక్షి రాజులమ్మ, పద్మ, ఎం.రాము, లోకనాథం, ఈశ్వరరావు, పోతయ్య, దాలప్పుడు తదితరులు ప్రసంగించారు.






# ఆ రోడ్డు.. అడుగేయడానికి కూడా అడ్డు!

(మొదటిపేజీ తరువాయి)

పనిని చేసేవారు. ఆ తర్వాత కారుల్లో ఉన్న ఏసీని కూడా బాగుచేయడం ప్రారంభించాక ఇక్కడ కార్ల సంఖ్య పెరిగింది. అన్నిటికీ రోడ్డే ఆధారం కావడం వల్ల ఎలా వచ్చిన కారును అలా నిలిపేసి బాగుచేస్తున్నారు. దీనివల్ల ఆ రోడ్డు మీద మరో వాహనం వెళ్లే పరిస్థితి కనిపించడంలేదు. ఎందుకంటే అప్పటికే ఎరువుల లోడింగ్ కోసం ఏదో ఒక వ్యాన్ అక్కడ ఉంటుంది. పెయింట్లు అన్‌లోడ్ కోసం మరో వ్యాన్ నిలుపుదల చేసివుంటుంది. నీటి సరఫరా కోసం ట్యాంకర్లు ఉంటున్నాయి. అడపాదడపా ఫర్నిచర్ షాప్ కోసం వచ్చే వాహనాలకూ తక్కువలేదు. కార్ల రిపేర్ల కోసం ఆక్రమించిన రోడ్డు మినహాయించి ఇవన్నీ పార్క్ చేసుకోవాల్సి ఉంటుంది. స్థానిక చిన్నబరాటంవీధిలో చెప్పుల షాపులు ఎక్కువగా ఉండటం వల్ల, అందులోనూ ఇది పాఠశాలలు తెరిచే సీజన్ కావడంతో రోడ్డు మీదే కార్లు పెట్టేస్తున్నారు. రెండువైపులా వచ్చీ పోయే వాహనాల వల్ల ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. చిన్నబరాటంవీధిలో చిక్కుకుపోయే బదులు కమిషనర్ బంగ్లా మీదుగా టౌన్‌హాల్ రోడ్డు నుంచి జీటీ రోడ్డు చేరుకోవాలని చూసినవారికి ఇక్కడ కూడా దారిచ్చే నాథుడు కనిపించడంలేదు. ఆమధ్య వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తే ఎస్ఐని పంపించి సుదీర్ఘ కాలంగా అక్కడే నిలిచిపోయిన వాహనాలను ముందుగా తీసేయాలని ఆదేశించారు. అది ఏమేరకు జరిగిందో తెలియదుగానీ ఇక్కడ ఎప్పటిలాగానే మళ్లీ కార్లు వచ్చి చేరుతున్నాయి. అటు చిన్న బరాటంవీధి వైపు వెళ్లలేక, ఇటు టౌన్‌హాల్ రోడ్డుకు మళ్లలేక కళింగ రోడ్డును మాత్రమే టూవీలర్ నడిపేవారు ఆశ్రయించడం వల్ల ఒకసారి సిగ్నల్ పడితే సెవెన్‌రోడ్ జంక్షన్ నుంచి పందుంపుల్లల జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనివల్ల మార్కెట్ రోడ్డు నుంచి వచ్చేవారు కళింగ రోడ్డు మీదకు వెళ్లలేకపోవడం వల్ల మార్కెట్ రోడ్డు కూడా జామ్ అవుతోంది. ఇంత పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నవారు పెద్దపాడు వైపు షిఫ్ట్ కావాల్సివున్నా ఎంహెచ్‌వో బంగ్లాకు ఆనుకొనే ఈ పనులు చేస్తుండటం పట్ల మున్సిపల్ యంత్రాంగం కూడా ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. పోలీసులు కూడా అడపాదడపా తమ వాహనాలకూ వీరి నుంచి సహకారం అందుతుందన్న కోణంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.




**అద్దెకు ఇవ్వబడును**

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అండుగులు (20×60)

- వివరాలకు సంప్రదించగలరు -

**9866 222 636**

# డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ దెబ్బ




(మొదటిపేజీ తరువాయి)

అవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లోనూ ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోవడంతో కొన్ని రకాల కోర్సులను ఎత్తేశారు. ప్రస్తుతం డిగ్రీలో బిఎస్సీ కంప్యూటర్స్ కోర్సులకే అత్యధిక డిమాండ్ ఉంది.

**ఇంజినీరింగ్ దెబ్బ**

ప్రభుత్వ రంగంలోని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, నరసన్నపేట, పాతపట్నం, పాలకొండ కళాశాలలకు మాత్రమే డిమాండ్ ఉంది. ప్రైవేట్ రంగానికి సంబంధించి శ్రీకాకుళం, నరసన్నపేట, రాజాం తదితర ప్రాంతాల్లోని కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్‌తో పాటు బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బయోకెమిస్ట్రీ కోర్సులకు డిమాండ్ ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఇంటర్‌లో ఎంపీసీ చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏపీఈఏపీసెట్‌లో 60వేలు ర్యాంకు వచ్చినా కన్వీనర్ కోటాలో ఇంజినీరింగ్ సీటు లభించే అవకాశం ఉంది. 20వేల ర్యాంకు వచ్చినవారికైతే కంప్యూటర్ సైన్స్‌లో సీటు లభించే అవకాశం కూడా ఉంది. కంప్యూటర్ సైన్స్‌లో సీటు దక్కనివారు కోర్ బ్రాంచ్‌లైన మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. కంప్యూటర్ కోర్సుపై మోజు ఉన్నవారు మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కొనుక్కొని మరీ చేరుతున్నారు. దీంతో డిగ్రీలో చేరడానికి ఆసక్తి చూపేవారి సంఖ్య తగ్గిపోతోంది. కన్వీనర్ కోటాలో సీటు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అందుతుండటంతో ఎక్కువమంది ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇది డిగ్రీలో కొన్ని కోర్సుల ప్రవేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో డిగ్రీలో ఎక్కువ మంది విద్యార్థులు చేరాలంటే ఆఫ్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియే మార్గమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వాదిస్తున్నాయి.

# కంఠస్థం చేసుకోలేకపోయిన అనుభవ కావ్యాలు!



**ఆనాటి జీవితాలు చిన్నవేమో, వాటిలో కలిగే కష్టసుఖాలన్నిటినీ వ్యాఖ్యానించగల శక్తి ఆ పద్యాలకున్నదేమో? అనుభవాలను కాచివడబోసిన జ్ఞానానికి ఎటువంటి ధారణశక్తీ ప్రత్యేకంగా అక్కరలేదేమో? డిసెంబర్ నెల చిక్కటి చలిలో చీకటిపొద్దునే కట్టెలపొయ్యి మీద కాచిన వేడినీళ్లతో స్నానం చేసి, నాన్నతో కలసి వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లిన రోజులెన్ని ఉంటాయి? మహా అయితే, రెండు ధనుర్మాసాలు! పూజార్లూ ఊళ్లో ఉన్న వైష్ణవులూ తిరుప్పావై చదువుతుంటే, మధ్యలో వచ్చి చేరినా అందుకుని పల్లాండు పల్లాండు అంటూ గొంతుకలిపే నాన్నను చూసి మొదటిసారి ఆశ్చర్యం వేసింది. అసలే, అది వేరే భాష, పైగా అందులోనూ మంత్రాలు (అట్లా అనుకునేవాడిని) ఎట్లా గుర్తుంటాయబ్బా అనిపించేది. సంస్కృతం విషయంలో ఆ సందేహం వచ్చేది కాదు. ఆయనకు ప్రసిద్ధ సంస్కృత శ్లోకాలు, వ్యాకరణ సూత్రాలు, అలంకారిక శాస్త్ర విషయాలు, చాలా మట్టుకు గుర్తుండేవి. వాటికి తోడు, యాజీకానికి, తతంగాలకీ, పూజలకీ సంబంధించిన మంత్రాలు!**

**చిన్నప్పుడు పిల్లవాడిని కాబట్టి, పెద్దయ్యాక పెద్ద హేతువాదిని అనుకునేవాడిని కాబట్టి, ఆ మంత్రాల మీద నాకు పెద్ద ఇది లేకపోయింది కానీ, మా నాన్నకున్న ధారణ శక్తి మీద మాత్రం బాగా గౌరవం ఉండేది. స్కూల్‌లో తెలుగు వాచకంలో పద్యాలు బట్టీ పట్టవలసి వచ్చేది, పట్టేవాడిని కానీ, అవసరం తీరిందంటే అవి మరపులోకి జారుకునేవి. ఇప్పటికి కూడా వేమన పద్యాలు మాత్రమే కొన్ని తడుముకోకుండా చెప్పగలుగుతాను, అందుకు ఏదో గట్టి పునాది పడి ఉండాలి. కావ్యాల నుంచి ఇచ్చే పద్యభాగాలలో పద్యాలు ఇష్టంగానే ఉండేవి కానీ, ఇప్పుడైతే, గుర్తులేవు. ఉంటే గింటే, మొదటి మొదటి మూడునాలుగు మాటలో, మహా అయితే, మొదటి పాదం. అంతే.**

నేను ఓరియంటల్ తెలుగు విద్యార్థిని కాబట్టి, నా జీవితంలోకి సంస్కృతం కూడా ప్రవేశించింది. శబ్దమంజరి అంతా కంఠతా వచ్చేది కానీ, ఇప్పుడు అదొక మసకబారిన జ్ఞాపకం. రామః, రామౌ, రామాః, ఈ ఒక్క శబ్దం, విభక్తి వచ్చు. కొడంగల్ ఓరియంటల్ కాలేజీలో ఎంట్రన్ తరగతిలో ఉన్నప్పుడు, హైదరాబాద్‌లో సంస్కృత శ్లోకాల అంత్యాక్షరి పెట్టారు, మా కాలేజీ నుంచి నన్ను, మరొకరిని పంపించారు. అందుకోసం ఒక 15 రోజుల పాటు శ్లోకాల బట్టీయం నడిచింది. శ్లోకాలు, అది కూడా అంత్యాక్షరికి పనికివచ్చే శ్లోకాలు (హల్లులతో మొదలయ్యే శ్లోకాలు కావాలి), ఒక 200 శ్లోకాలు నోటికి వచ్చేట్టు సాధన చేశాము. పోటీలో మొదటి రౌండులోనే నేను డక్ అవుట్ అయ్యాను. ఆ అక్షరం మీద పది పదిహేను శ్లోకాలు వల్లె వేసిన గుర్తు. కానీ, ఆ సమయానికి ఒక్కటీ గుర్తు రాలేదు. స్ఫురణ కోసం తడుముకుంటుంటే, ఖణేల్మని ఇనుపగోడ తగలడమే కానీ, అంబ పలకలేదు. ధారణ శక్తిలో నేను సున్నా అని నిర్ధారణ అయ్యి, చాలా నిరుత్సాహం కలిగింది.

మా తండ్రి తరానికీ, నాకూ విద్యావిధానంలో ఉన్న తేడా వల్ల కొంత, నాకు ఏకాగ్రత సమస్యలు ఉండడం వల్ల మరికొంత, నాకు పద్యాలు, శ్లోకాలు అందీ అందని చేలాంచలములే అయ్యాయి. భావం వెంట మాత్రమే నా కళ్లు పరుగెత్తేవేమో, పదాలను వాటి భౌతికస్వరూపాన్ని మనసులో బలంగా ప్రతిష్ఠించుకోలేదేమో? రెంటిని జమిలిగా లోలోపలికి ఇంకించుకుంటే భిన్నంగా ఉండేదేమో? ఇప్పుడంటే మెమరీని యంత్రస్థం చేసుకోవచ్చు, మరి అప్పుడెందుకు జ్ఞాపకాన్ని నిర్లక్ష్యం చేశాను?

తెలుగు చదువులో మాకు ప్రబంధాలు చెప్పిన వారిలో నాయని కోటీశ్వరి ముఖ్యులు. ఆమె విజయవిలాసం చెప్పేవారు. అందులో పద్యాలు చాలా బాగుంటాయి. ఎంపిక చేసిన పద్యాలను గుర్తుండేట్టు మననం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆమె చెప్పినవే కాక, బంధుమిత్రుల దగ్గర విద్యాప్రదర్శన కోసం కాబోలు, ఎక్కువ సంస్కృత సమాసభూయిష్ఠంగా ఉండేవి, ప్రత్యేకమైన నడకతో లయబద్ధంగా ఉండేవి కొన్ని పద్యాలు మేం అదనంగా నేర్చుకున్నాం. 'సునాసీర సూనుండు జూచె నిమ్మజ్జజ్జనౌఘోత్తత్పంక శంకాక రాత్మోర్మి..' ఇట్లా చదివితే కలిగే మజావేరు. ఇక పంచచామరాలు, దండకాలు వాటిలో బాణీలు, వాటికి మా పేరడీలు, వాటన్నిటిలోనూ సాహిత్యోత్సాహం పొంగిపొర్లేది. ఇప్పటికీ వాటిలో కొన్ని పద్యాలు నోటికి వచ్చు, తప్పుల్లేకుండా కాదు, తడుముకోకుండానూ కాదు. ఆధునిక కవిత్వంలో ముఖ్యంగా శ్రీశ్రీ మహాప్రస్థానంలోనివి అనేక ఖండికలు ఒకప్పుడు నోటికి వచ్చేవి. ఇప్పుడూ వస్తాయి కానీ, ఎవరన్నా అందిస్తూ ఉండాలి.

82లోనో 83లోనో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ కోసం దరఖాస్తు చేశాను. ఎంచుకున్న అంశం ఆధునిక తెలుగుకవిత్వంలో నగరజీవిత చిత్రణ–కుందుర్తి 'నగరంలో వాన'. అందుకోసం ఒక వ్యాసం కూడా రాశాను. తెలిసినవాళ్లకు తెలిసినవాళ్లున్నారని ఆంధ్రభూమిలో ఒకరికి ఇస్తే, ఆయన ఎందుకో వేయలేదు. ఇంటర్వ్యూకు నిరాయుధుడిగా, ఆశారాహిత్యంతోనే వెళ్లాను. కొత్తపల్లి వీరభద్రరావుగారు బోర్డులో ఉన్నారు. 'టాపిక్ బాగుందయ్యా, ఏదీ **నగరంలో వాన** నుంచి ఓ ఆసక్తికరమైన భాగం ఏదైనా చెప్పు' అన్నారాయన. 'వచన కవిత్వం ధారణ చేయలేము కదండీ' అన్నాను అతి తెలివిగా. జీవీ సుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు అక్కడ. ఆయన కల్పించుకుని, నన్ను వీరభద్రరావు కోప్పడకుండా, నేను నొచ్చుకోకుండా, ఏయే కవులు నగరజీవితం మీద రాశారు వంటి జనరల్ ప్రశ్నలు వేసి పంపించారు. ఫలితం ఊహించిందే, హైదరాబాద్ యూనివర్సిటీకి నా విద్యార్థిత్వం లభించలేదు.

బాగా నచ్చిన పుస్తకం చదివినప్పుడు, అందులోని కొన్ని వాక్యాలు బాగా ఎక్కువగా ఆకట్టుకోవడం సహజమే. చెంఘిజ్ ఖాన్ మొదటి సారి చదివినప్పుడు (అంటే మొదటి రోజున చదివిన రెండుసార్లలో మొదటిసారి అన్నమాట) మొదటి వాక్యం, ఆ తర్వాతి రెండుమూడు వాక్యాలూ పదే పదే మననం చేసుకున్నాను. ఒక నవల ఎత్తుగడ అంటే ఇట్లా ఉండాలి కదా అనుకున్నాను. చాలాకాలం యథాతథంగా గుర్తు పెట్టుకోగలిగాను, ఈ మధ్య దాకా ఆ జ్ఞాపకం అరిగిపోలేదనే అనుకుంటూ వస్తున్నా. అసందర్భంగా ఈ మధ్య అనేక సందర్భాలలో 'నెగళ్లు జాజ్వల్యమానంగా మండుతున్నాయ్' అని ఉటంకిస్తూ తెన్నేటి సూరిని పొగుడుతూ వచ్చాను. ఈమధ్య తారసపడిన పుస్తకాన్ని తిరగేసి చూద్దును కదా, అది 'జాజ్వల్యమానంగా నెగళ్లు మండుతున్నాయ్'. జ్ఞాపకం కూడా వాచకాన్ని తిరగరాస్తుందా? ఇట్లా ఈ మధ్య ఎన్ని ప్రసిద్ధ ఉటంకింపులకు నా జ్ఞాపకంలో పాఠాంతరాలు ఏర్పడ్డాయో తెలియదు. 'చలం' ఆత్మకథ మొదటి వాక్యం నాకు చాలా ఇష్టం. అది నా ప్రస్తావనల్లో అరిగిపోయి, అరిగిపోయి చివరకు 'సృష్టికైన అనాది చలనంలో నేనూ అవ్యక్తంగా జన్మించాను' అని మారిపోయింది. చలం రాసినదాన్ని నేను నా ఇష్టం వచ్చినట్టు తిరగరాసుకుని, కుప్తం చేసుకుని గుర్తుపెట్టుకున్నానని ఈ మధ్యనే గుర్తించాను. భావం చెడిపోకున్నా 'మిస్ కోటేశ్వరరావు' కావడం ఎందుకు? అందుకే, ఈ మధ్య, నా స్మరణశక్తి మీద నమ్మకం లేక, కోట్ చేసినప్పుడు, తేదీలు వేసినప్పుడు తప్పనిసరిగా సరిచూసుకోవడం అలవాటు చేసుకుని, పబ్లిక్ హుమిలియేషన్ నుంచి తప్పించుకుంటున్నాను. కానీ, ఏ మాటకు ఆ మాటే చెప్పాలి. ఉన్నదున్నట్టు అప్పజెప్పలేకపోవచ్చును కానీ, తప్పుడుగా మాత్రం చెప్పను. అదే అర్థంలో మాటలు కాస్త అటూ ఇటూగా.

ఒక అంశం గురించి అవగాహన కల్పించుకోవడం సులభమనిపిస్తుంది. ఆ అంశంలోని నిర్దిష్ట సమాచారం ఏదైనా యథాతథంగా గుర్తుపెట్టుకోవాలంటే ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలంటే చిరాకు. ఒక్కోసారి, ఇచ్చిన నాలుగు సమాధానాల్లో ఒకటి ఎంచుకోవడం ఎంతో కష్టం అనిపిస్తుంది. తారీఖులు, దస్తావేజులు చరిత్ర సారం కాదని శ్రీశ్రీ అన్నాడు కానీ, ఏ సబ్జెక్టుకు అయినా తేదీలూ, అంకెలూ, స్థలాలూ అవీ ముఖ్యం కాదేమోనని నా రహస్యాభిప్రాయం. కొందరు మిత్రులు టకటకా పద్యాలూ కవిత్వాలూ ఉటంకిస్తూ, ఉపన్యాసాలు చేస్తుంటే నాకు కొంచెం అసూయగా ఉంటుంది. పేజీలు మడతపెట్టో, బుక్ మార్కర్లు పెట్టో, నోట్స్ తీసుకునో తప్ప కోట్ చేస్తూ మాట్లాడలేనేమోనని నాకు అర్థమయింది. పూర్వపు తరం పండితుల కోవలో నడిచే కొందరు సమకాలీనులు, అయితే గియితే రాజకీయాల్లోనో సామాజిక అవగాహనలోనో కొంచెం వెనుకబడి ఉంటారేమో కానీ, వారి క్రమశిక్షణ, ధారణ, స్ఫురణ శక్తి ఆశ్చర్యమే కలిగిస్తాయి. జాక్ ఆఫ్ ఆల్ కాబోయి, మాస్టర్ ఆఫ్ నన్ అయిపోయి పొరపాటు చేశానేమో, భాషాశాస్త్రం మీదో లఘుసిద్ధాంత కౌముది మీదో పనిచేసి ఉంటే, ఏదో ఒకరంగం ఉండేది, విశాలమైన పరిజ్ఞానం కాక, లోతైన జ్ఞానం అబ్బి ఉండేది.

ప్రపంచపు లెక్కలో మా అమ్మ పెద్దగా చదువుకోలేదు. కానీ, కనీసం ఒక పది పద్యాలు, ఓ పాతిక పాటలు ఆమెకు నోటికి వచ్చేవి. సందర్భానికి తగినట్టుగా పద్యాలను చదవడం ఆమె ఎప్పుడూ చేయగలిగేది. నాకు అప్పుడెప్పుడో ఒక కష్టం వచ్చి, దాని నుంచి గట్టెక్కితే, ఆమె, 'ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై' అనే ఏనుగు లక్ష్మణకవి (భర్తృహరి) పద్యాన్ని చదివి భుజం తట్టింది. అనేక మార్లు ఆమె ఆ పద్యాన్ని ఇతరులకు కూడా సందర్భోచితంగా ప్రస్తావించింది. చివరి రోజుల విస్మరణలోనూ ఆ పద్యం మరచిపోలేదు. ఆనాటి జీవితాలు చిన్నవేమో, వాటిలో కలిగే కష్టసుఖాలన్నిటినీ వ్యాఖ్యానించగల శక్తి ఆ పద్యాలకున్నదేమో? అనుభవాలను కాచి వడబోసిన జ్ఞానానికి ఎటువంటి ధారణశక్తీ ప్రత్యేకంగా అక్కరలేదేమో?



కె.శ్రీనివాస్

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.